# తెలుగుప్రభ

వైబ్రెంట్ ఎడిషన్ 4pm

మన భాష.. మన పత్రిక

గురువారం 13-7-2023

teluguprabha.net -TeluguPrabha @TeluguPrabhaofficial




## సీఎం సీతక్కపై మాణిక్ క్లారిటీ

**తెలుగుప్రభ, హైదరాబాద్ (జూలై 13)**

టీపీసీసీ అధ్యక్షుడు తనకు ఏది తోస్తే అది మాట్లాడేస్తున్నారు. ఆయన మాటలకు ఇతర నేతలు వివరణలు ఇచ్చుకోవాల్సి వస్తోంది. కాంగ్రెస్‌లో సీఎం ఎవరు అనేది నిర్ణయించేది ఆది నుంచీ ఆ పార్టీ ఢిల్లీ పెద్దలే. అది అందరికీ తెలిసిన విషయమే. కానీ, అవసరమైతే సీతక్కను సీఎం చేయవచ్చునని రేవంత్ చేసిన వ్యాఖ్యలపై తాజాగా తెలంగాణ కాంగ్రెస్ సీఎం అభ్యర్థిపై రాష్ట్ర కాంగ్రెస్ వ్యవహారాల ఇంచార్జ్ మాణిక్ రావు ఠాక్రే క్లారిటీ ఇచ్చారు. సీఎంగా ఎవరికైనా అవకాశం లభించవచ్చని, ఇప్పుడు చెప్పలేమని తెలిపారు. కాంగ్రెస్‌లో అందరికీ అవకాశాలు ఉంటాయని, సీఎం అభ్యర్థి గురించి ఇప్పుడే చర్చించడం సరికాదని చెప్పారు. కాంగ్రెస్ సీఎం అభ్యర్థిని ఎమ్మెల్యేల అభిప్రాయం తీసుకున్నాకే అధిష్టానం నిర్ణయిస్తుందన్నారు. మరోవైపు, సీతక్కకు సీఎంగా అవకాశం ఉండదని భువనగిరి ఎంపీ కోమటిరెడ్డి వెంకటరెడ్డి తేల్చి చెప్పారు. సీఎంగా ఎవరికైనా అవకాశం దక్కవచ్చన్నారు. రేవంత్ రెడ్డి సీఎం క్యాండిడేట్ గురించి చర్చ పక్కనపెట్టి కాంగ్రెస్‌ను గెలిపించేలా కృషి చేయాలని సూచించారు.



## చికెన్ వండలేదని.. భార్యను చంపేశాడు..

**తెలుగుప్రభ, మంచిర్యాల (జూలై 13)**

రోజురోజుకు మానవీయ సంబంధాలు మంటగలిసిపోతున్నాయి. చిన్న చిన్న విషయాలకే చంపుకుంటున్నారు. తల్లిని బిడ్డ, బిడ్డను తల్లి, భార్యను భర్త.. ఇలా హత్యలకు పాల్పడుతున్న ఘటనలు కలకలం సృష్టిస్తున్నాయి. తాజాగా మంచిర్యాల జిల్లాలో దారుణం జరిగింది. చికెన్ వండలేదని భార్యను చంపేశాడు. ఈ ఘటన మంచిర్యాల జిల్లాలోని చెన్నూరు మండలంలోని కిష్టంపేట గ్రామంలో వెలుగు చూసింది. బుధవారం రాత్రి భర్త గాలిపెల్లి పోశం(50) చికెన్ తీసుకురాగా, భార్య వండలేదు. దీంతో భార్యాభర్తల మధ్య తీవ్ర వాగ్వాదం చోటు చేసుకుంది. ఇంట్లో నిద్రిస్తున్న భార్య శంకరమ్మపై పోశం గురువారం ఉదయం గొడ్డలితో దాడి చేశాడు. విచక్షణారహితంగా నరికి చంపాడు. అనంతరం పోశం పరారీ అయ్యాడు. స్థానికులు అందించిన సమాచారంతో ఘటనాస్థలానికి పోలీసులు చేసుకుని, మృతదేహాన్ని స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేపట్టారు. నిందితుడి కోసం గాలిస్తున్నారు.

## లేటెస్ట్ న్యూస్

## కేసీఆర్ కృషి వల్లే ఆ వైభవం

### మంత్రి ఎర్రబెల్లి దయాకర్

**తెలుగుప్రభ, యాదాద్రి (జూలై 13)**



తెలంగాణ ముఖ్యమంత్రి కె.చంద్రశేఖరరావు కృషి వల్లే తెలంగాణలోని ఆలయాలు వైభవోపేతంగా వెలుగొందుతున్నాయని మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు అన్నారు. తిరుపతి, ఇంద్రకీలాద్రి తరహాలో యాదగిరిగుట్ట దేవాలయాన్ని పునర్‌నిర్మించి సీఎం కేసీఆర్ చరిత్రలో నిలిచిపోయారని చెప్పారు.

తెలంగాణలో దేవాలయాలకు పూర్వ వైభవం వచ్చిందన్నారు. కుటుంబ సమేతంగా యాదాద్రి శ్రీ లక్ష్మి నరసింహ స్వామివారిని మంత్రి ఎర్రబెల్లి దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. చరిత్రలో నభూతో న భవిష్యత్తు అన్న చందంగా సీఎం కేసీఆర్ యాదాద్రి దేవాలయాన్ని పునర్ నిర్మించారని చెప్పారు. దేవాలయం మొత్తం ఆధ్యాత్మికత ఉట్టిపడేలా అద్భుతంగా ఉందని, నిర్మాణ కౌశలం భక్తి పారవశ్యం పొంగిపొరలే విధంగా జరిగిందన్నారు. కేసీఆర్ ముఖ్యమంత్రి అయిన తర్వాతే దేవాలయాలకు పూర్వవైభవం వచ్చిందని తెలిపారు.



## తెలంగాణలోనూ జోరు వానలు

### పెరుగుతున్న గోదావరి నీటి మట్టం

తెలుగుప్రభ, హైదరాబాద్ (జూలై 13) తెలంగాణలో కూడా ఎడతెరిపి లేని వర్షాలు కురిసే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం తెలిపింది. ఇప్పటికే కొత్తగూడెంలో ఎడతెరపి లేకుండా కురుస్తున్న వర్షం.. సింగరేణిలో నిలిచిన బొగ్గు ఉత్పత్తి భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కేంద్రం కొత్తగూడెంలో గురువారం తెల్లవారుజాము నుంచి ఎడతెరపిలేకుండా వర్షం (Rain) కురుస్తున్నది. భద్రాచలం, బూర్గంపాడు, దుమ్ముగూడెం మండలాల్లో భారీ వాన పడుతోంది. వర్షం కారణంగా సింగరేణి జీకేఓసీలో బొగ్గు ఉత్పత్తికి అంతరాయం ఏర్పడింది. ఎగువన భారీ వర్షాలతో భద్రాచలం వద్ద గోదావరి నదిలో ఒక్కసారిగా ప్రవాహం పెరిగింది. ఒక్కరోజులోనే నదిలో నీటిమట్టం 13 అడుగులకు చేరింది.

## తెలంగాణపై బొత్స షాకింగ్ కామెంట్స్

### జాగ్రత్తగా మాట్లాడాలన్న తెలంగాణ మంత్రులు

**తెలుగుప్రభ, విజయవాడ (జూలై 13)**



ఏపీ మంత్రి బొత్స సత్యనారాయణ తెలంగాణ విద్యా వ్యవస్థపై కీలక వ్యాఖ్యలు చేశారు. కనీసం టీచర్ల బదిలీలు చేసుకోలేని దుస్థితి ఉందన్నారు. కమిషన్ పరీక్షలు నిర్వహించుకోలేరని.. అక్కడ ఎలాంటి కుంభకోణాలు జరిగాయో అందరికీ తెలుసన్నారు. అలాంటిది ఏపీకి తెలంగాణతో పోలికా అంటూ సీరియస్ కామెంట్స్ చేశారు. విజయవాడలో ఆర్జీయూకేటీ ఆధ్వర్యంలోని 4 ట్రిపుల్ ఐటీలకు ఎంపికైన అభ్యర్థుల జాబితాను విడుదల చేసిన సందర్భంగా ఆయన మాట్లాడారు. 'మన విధానం మనది, మన ఆలోచనలు మనవి' అన్నారు. ఆఫ్టాల్ సర్వీస్ కమిషన్ పరీక్షలనే నిర్వహించుకోలేని పరిస్థితి తెలంగాణలో ఉందని.. తెలంగాణ సర్వీస్ కమిషన్ పరీక్షల్లోనే ఎలాంటి స్కాంమ్‌లు జరిగాయో చూశామన్నారు. అన్ని చూచిరాతలే.. ఎంత మంది అరెస్టులు అవుతున్నారో వార్తలు వస్తూనే ఉన్నాయన్నారు. టీచర్ల బదిలీలే చేసుకోలేని పరిస్థితి తెలంగాణలో ఉందని.. అందుకే ఒక రాష్ట్రాన్ని ఇంకో రాష్ట్రంతో పోల్చకూడదని.. ఎవరి ఆలోచన వారిది, ఎవరి విధానం వారిదే అని వ్యాఖ్యానించారు. మంత్రి బొత్స సత్యనారాయణ చేసిన వ్యాఖ్యలు మరోసారి హీట్ పెంచాయి. బొత్స వ్యాఖ్యలపై తెలంగాణ మంత్రులు స్పందించారు. ఆయన విషయాలు పూర్తిగా తెలుసుకుని మాట్లాడాలని హెచ్చరించారు.

### ఇంకా విషం చిమ్ముతున్నారు..



ఏపీ విద్యా శాఖ మంత్రి బొత్స సత్యనారాయణ చేసిన వ్యాఖ్యలపై తెలంగాణ నేతలు ఫైర్ అవుతున్నారు. తెలంగాణ మంత్రి గంగుల కమాలకర్ బొత్స వ్యాఖ్యలపై ఫైర్ అయ్యారు. తెచ్చుకున్న తెలంగాణపై ఇంకా విషం చిమ్ముతున్నారంటూ విమర్శించారు. ఈ సందర్భంగా గంగుల మాట్లాడుతూ..'ఇప్పుడు వైసీపీలో ఉన్న బొత్స తెలంగాణ రాకముందు కాంగ్రెస్‌లో మంత్రిగా ఉన్నారు. ఆయన అప్పుడు కూడా తెలంగాణ కి వ్యతిరేకంగా మాట్లాడారు. ఇప్పుడు తెలంగాణ స్వరాష్ట్రం వచ్చాక కూడా విషం చిమ్ముతున్నారు. తెలంగాణ వచ్చాక రాష్ట్రము లో విద్యావ్యవస్థ మెరుగుపడింది. 297 గురుకులాలు మాత్రమే నాడు తెలంగాణ ప్రాంతంలో ఉండేవి. నాడు మంత్రిగా ఉన్న ఆంధ్ర నాయకుల వైఫల్యం వల్ల ఎంతోమంది చదవలేకపోయారు. కానీ ఇప్పుడు తెలంగాణ లో 1009 గురుకులాలు ఏర్పాటు చేసుకున్నాం . పది లక్షల మంది విద్యార్థులు ఇప్పుడు చదువుకుంటున్నారు. ఇప్పుడు కూడా ఏపీ లో 380 గురుకులాలే ఉన్నాయి. అవి కూడా పదోతరగతికి మాత్రమే పరిమితం చేశారు. బొత్స సత్యనారాయణ ఇష్టానుసారం మాట్లాడటం సరికాదంటూ' విరుచుకుపడ్డారు. 'పేపర్ లీకేజీ తప్పు జరిగితే పట్టుకుంది ప్రభుత్వమే. తప్పు చేసినవారిని శిక్షిస్తున్నాం. అన్నారు

## బీసీలకు రూ. లక్ష.. 15 నుంచే..!

**తెలుగుప్రభ, హైదరాబాద్ (జూలై 13)**



తెలంగాణ ప్రభుత్వం సంక్షేమ పథకాల అమలులో దూసుకెళ్తోంది. అన్ని వర్గాల అభివృద్ధికి తోడ్పాటు అందిస్తోంది. కులవృత్తుల్లోని చేతివృత్తుల వారి జీవన ప్రమాణాలు పెంచడానికి కేసీఆర్ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న బీసీలకు లక్ష పథకంపై కీలక అప్డేట్. ఈ పథకం కింద నియోజవర్గానికి తొలివిడతలో 50 మందిని ఎంపిక చేయాలని ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది.తెలంగాణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా రాష్ట్ర ప్రభుత్వం ఈ పథకాన్ని ప్రారంభించింది. బీసీలు వృత్తి పనిముట్లు, ముడిసరుకు కొనుగోలుకు ఈ నిధులు ఉపయోగపడతాయని ప్రభుత్వం చెబుతోంది. ఈ పథకానికి సంబంధించిన దరఖాస్తుల ప్రక్రియ జూన్ 26తో ముగిసింది. రాష్ట్రవ్యాప్తంగా 5 లక్షల మందికి పైగా దరఖాస్తు చేసుకున్నారు. ప్రస్తుతం జిల్లా కలెక్టర్ల ఆధ్వర్యంలో అర్హుల ఎంపిక ప్రక్రియ జరుగుతోంది. ఈనెల 15 నుంచి బీసీ కులవృత్తుల వారికి ఆర్థికసాయం అదించేందుకు ప్రభుత్వం కసరత్తు చేస్తోంది. అయితే తొలి విడతలో నియోజవర్గానికి 50 కుటుంబాలకు ఈ ఆర్థిక సాయం అందించనుంది. 119 నియోజవర్గాల్లో 5950 మందికి రూ. లక్ష చొప్పున ఆర్థిక సాయం చేయనున్నారు. ఇందుకోసం అవసరమైన నిధులను తెలంగాణ ప్రభుత్వం విడుదల చేసింది. రూ.400 కోట్లు మంజూరు చేస్తూ మంగళవారం (జులై 11) ఉత్తర్వులు జారీచేసింది. వీటిని బీసీ కార్పొరేషన్ ద్వారా వెచ్చించాలని ఉత్తర్వుల్లో ప్రభుత్వం ఆదేశించింది.



## ఎమ్మెల్యే చెంప చెల్లుమనిపించిన మహిళ

### కారణం ఏంటంటే..

**తెలుగుప్రభ, న్యూఢిల్లీ (జూలై 13)**

వరద బాధితులను పరామర్శించడానికి వచ్చిన ఓ ఎమ్మెల్యేకు చేదు అనుభవం ఎదురైంది. ఓ మహిళ చెంప పగలగొట్టడంతో ఆయన దిక్కుతోచని స్థితిని ఎదుర్కొన్నారు. విషయం ఏంటంటే.. వరదలు హర్యానాలో భీభత్సం సృష్టించాయి. ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాల ధాటికి హర్యాణా రాష్ట్ర వ్యాప్తంగా రోడ్లన్నీ జలమయ్యాయి. లోతట్టు ప్రాంతాలు మునిగిపోయాయి. ఇప్పటికే అనేక మంది వరద నీళ్లలో గల్లంతయ్యారు. పశువులు మృత్యువాత పడ్డాయి. వరద ప్రభావిత ప్రాంతాలను ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి మనోహర్ లాల్ ఖట్టర్ సందర్శించారు. మృతుల కుటుంబాలకు రూ.4 లక్షల చొప్పున ప్రకటించారు. తాజాగా ఆ రాష్ట్రంలోని కైతాల్ జిల్లాలోని వరద ప్రభావిత ప్రాంతం గుహ్లాను జననాయక్ జనతా పార్టీ (జేజేపీ) ఎమ్మెల్యే ఈశ్వర్ సింగ్ సందర్శించారు. గుహ్లా చీకా నియోజకవర్గ ఎమ్మెల్యే రాకతో ఆ ప్రాంతంలో జనసమూహం గుమిగూడింది. ఆ ప్రాంతంలోని డ్రైనేజీ వ్యవస్థపై స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేశారు. సహనం కోల్పోయిన ఓ బాధితురాలు ఎమ్మెల్యేపై దాడి చేసి చెంపపై కొట్టింది. వెంటనే ఎమ్మెల్యే భద్రతా సిబ్బంది ఆయనను రక్షించారు. ఈ ఘటనకు సంబంధించిన వీడియో ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది.

## ఒడిశా రైలు ప్రమాదం పాపం ఆ అధికారులదే..

### ఏడుగిరిపై వేటు!

**తెలుగుప్రభ, న్యూఢిల్లీ (జూలై 13)**



ఒడిశా రైలు ప్రమాదం దేశాన్నే దిగ్భ్రాంతికి గురి చేసింది. ఏకంగా 293 మంది ప్రాణాలను బలిగొన్న ఒడిశాలోని బాలాసోర్ రైలు ప్రమాదంలో ఏడుగురు ఉద్యోగులను భారతీయ రైల్వే సస్పెండ్ చేసింది. డ్యూటీ సమయంలో అప్రమత్తంగా ఉండనందుకు స్టేషన్ మాస్టర్, ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్, మెయింటెయినర్‌తో సహా 7 మందిని సస్పెండ చేసినట్లు సౌత్ ఈస్టర్న్ రైల్వే జనరల్ మేనేజర్ అనిల్ కుమార్ మిశ్రా తెలిపారు. బాలాసోర్ విపత్తుకు సంబంధించి సిబిఐ ఇప్పటివరకు ముగ్గురు రైల్వే అధికారులను అరెస్టు చేసింది. అధికారులు అప్రమత్తంగా ఉండిఉంటే పెను ప్రమాదం తప్పేదని అన్నారు. సౌత్-ఈస్టర్న్ రైల్వే కొత్త GM, DRM గత బుధవారం బహనాగ బజార్, బాలాసోర్ రైల్వే స్టేషన్లను సందర్శించారు. దీంతో ఏడుగురు ఉద్యోగులను సస్పెండ చేస్తూ ఉత్తర్వులు జారీ చేసింది రైల్వే శాఖ.

సీనియర్ సెక్షన్ ఇంజనీర్ (సిగ్నల్) అరుణ్ కుమార్ మహంతా, సెక్షన్ ఇంజనీర్ మహమ్మద్ అమీర్ ఖాన్, టెక్నీషియన్ పప్పు కుమార్‌లను సీబీఐ అరెస్ట్ చేసింది. వీరిని నాలుగు రోజుల పాటు సీబీఐ కస్టడీలో ఉంచారు. కాగా, బాలాసోర్ రైలు ప్రమాదంపై రైల్వే సేఫ్టీ కమిషనర్ విచారణ నివేదికలో వెల్లడైన అంశాలు. సిగ్నలింగ్ అండ్ ఆపరేషన్స్ (ట్రాఫిక్) విభాగం విఫలమైందని తేలింది. బెహనాగా స్టేషన్‌లోని ఈ రెండు విభాగాల ఉద్యోగులే ప్రమాదానికి కారణమని నివేదికలో పేర్కొన్నారు. ట్రాక్ నిర్వహణ తర్వాత భద్రతా ప్రోటోకాల్ అనుసరించబడలేదు. రైలు వెళ్లే ముందు భద్రతా ఏర్పాట్లను పరిశీలించలేదని రైల్వే బోర్డుకు సమర్పించిన నివేదికలో పేర్కొంది. జూన్ 2న ఒడిశాలోని బాలాసోర్ జిల్లాలోని బహంగా బజార్ రైల్వే స్టేషన్ సమీపంలో మూడు రైళ్ల మధ్య జరిగిన ప్రమాదంలో 293 మంది మరణించగా, 1,200 మందికి పైగా గాయపడ్డారు. ఈ విషాద దుర్ఘటన యావత్ దేశాన్ని కుదిపేసింది.

## లెక్కల చిట్టాతో పురంధేశ్వరి ఫైర్

### ఏపీ సర్కారుపై విమర్శలు

**తెలుగుప్రభ, అమరావతి (జూలై 13)**



బీజేపీ ఏపీ అధ్యక్షురాలిగా బాధ్యతలు స్వీకరించిన పురంధేశ్వరి తనదైన శైలిలో రాజకీయాలు మొదలుపెట్టారు. జగన్ సర్కార్ టార్గెట్‌గా విమర్శలు గుపించారు. కేంద్రం రాష్ట్రానికి రూ.వేలకోట్ల నిధులు కేటాయించిందని.. కేంద్రం ఇచ్చిన నిధులు తప్ప రాష్ట్ర ప్రభుత్వం ఎక్కడ రహదారులు వేసిందో చెప్పాలని.. రాష్ట్రంలో ఉన్న రోడ్ల పరిస్థితి ప్రజలందరికీ తెలుసన్నారు. మహిళలకు రక్షణ కల్పించలేని పరిస్థితుల్లో ఏపీ ప్రభుత్వం ఉందని.. మహిళలు మొబైల్ ఊపడానికే తప్ప దిశా ఎందుకు పనికిరావడం లేదని ధ్వజమెత్తారు. ఏపీకి కేంద్రం 25 లక్షల ఇళ్లను మంజూరు చేసిందని.. గడచిన తొమ్మిదేళ్లలో రూ.20 వేల కోట్లు ఒక్క పీఎమ్ఏవై కింద ఇచ్చిందని తెలిపారు. ఇంత సాయం చేసినా కేవలం 35 శాతం మాత్రమే పూర్తి చేశారని.. పేదలకు ఇచ్చే సమాధానం ఏంటి అని జగన్ సర్కార్‌ను ప్రశ్నించారు. రెండేళ్లలోనే విభజన చట్టంలో చెప్పినట్టు జాతీయ విద్యా సంస్థలు అన్ని నెలకొల్పారన్నారు. విజయవాడ ఎయిర్‌పోర్టు విస్తరణ, పలు ఎయిర్‌పోర్టుల నిర్మాణానికి అనుమతి ఇచ్చినట్లు తెలిపారు. రాష్ట్రానికి పరిశ్రమలు తేలేదని.. జాకీ లాంటి సంస్థ కూడా వెళ్లిపోయిందన్నారు. ప్రభుత్వం చెప్పిన దశలవారీ మద్య నిషేధం ఏమైందని.. మద్యం విషయంలో పెద్ద కుంభకోణం జరుగుతోందన్నారు. రాష్ట్రంలో శాంతిభద్రతలు దారుణంగా ఉన్నాయని.. పదో తరగతి విద్యార్థిని దారుణంగా సజీవ దహనం చేశారని విమర్శించారు. విశాఖలో ఎంపీ కుటుంబానికే రక్షణ లేదని.. నాసిరకం మద్యాన్ని విక్రయిస్తూ ప్రజల ప్రాణాలను హరిస్తోందని మండిపడ్డారు. పవన్ కళ్యాణ్‌తో నిన్న ఉన్నాం.. నిన్న ఉన్నాం.. నేడు ఉన్నా.. రేపు కూడా ఉంటామన్నారు. పవన్‌తో సమన్వయం చేసుకుంటామని.. పొత్తుల విషయాన్ని అధిష్టానం చూసుకుంటుందన్నారు. ఏపీకి ఎన్ఆర్‌జీపీ కింద 2022 – 23 వరకు 8 వేలకు కోట్లకు పైగా వచ్చాయని.. రాష్ట్రంలో 90 లక్షల మందికి ఉచిత బియ్యం అందుతోందన్నారు. ఈ ఏడాది బియ్యం ద్వారా 10 వేల కోట్లకు పైగా రాష్ట్రానికి అందిందన్నారు. కేంద్రం పోలవరానికి ఇటీవల రూ.12 వేల కోట్లు ఇచ్చిందని.. పోలవరం మీరు ఏపీ ప్రభుత్వం కేంద్రానికి అప్పచెప్పాలన్నారు.

మైనింగ్ వ్యాపారులపై దాడులు చేయించి తనకు అనుకూలంగా ఉన్నవారికి ఇప్పించుకుంటూ దోచుకున్నారని ఘాటు విమర్శలు చేశారు. ఎక్కడ భూమి కనబడితే అక్కడ కబ్జా చేస్తున్నారన్నారు.